సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 6 । జనవరి । 2024



ముగిసిన సినిమా షూటింగ్

నేరడిగొండ మండలం కుంటాల జలపాతం వద్ద స్వాగ్ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ శుక్రవారంతో ముగిసింది. 8లో▸



'ఉట్నూర్'కు ఎన్‌క్వాస్ గుర్తింపు

ఉట్నూర్ సీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ తెలిపారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది. వేకువజామున మంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన వైద్య ఉద్యోగులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 సంఘ బాధ్యులు శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఇందులో సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, సంతోష్, రవీందర్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

గాదిగూడ ఎంపీడీవోపై సస్పెన్షన్ వేటు

కైలాస్‌నగర్: గాదిగూడ ఎంపీడీవో రామేశ్వర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. జెడ్పీ సమావేశ మందిరంలో ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై కలెక్టర్ శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. ఇటీవల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్షకు కూడా గైర్హాజరయ్యారు. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందుకుగాను ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, అకౌంటెంట్‌తో పాటు ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీలో అకౌంటెంట్ పోస్టు 1, ఆదిలాబాద్ అర్బన్ కేజీబీవీలో హెడ్ కుక్ 1, బేల కేజీబీవీలో హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 1, గాదిగూడ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ 1, నేరడిగొండ కేజీబీవీలో హెడ్ కుక్ 2, అసిస్టెంట్ కుక్ 3, సిరికొండ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, అలాగే బంగారుగూడలోని మోడల్ స్కూల్‌లో ఏఎన్‌ఎం పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్‌లకు నెలకు రూ.9,750, అకౌంటెంట్‌కు రూ.14,300, ఏఎన్‌ఎం పోస్టుకు రూ.7,800 వేతనం ఉంటుందని పేర్కొన్నారు. అకౌంటెంట్ పోస్టుకు డిగ్రీలో కామర్స్ చదివి ఉండాలని, బీకాం కంప్యూటర్, పీజీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అకౌంటెంట్, ఏఎన్‌ఎం పోస్టులకు డీఈవో కార్యాలయంలో, మిగిలిన పోస్టులకు ఎంఈవో కార్యాలయాల్లో ఈనెల 8 నుంచి 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


ఎదులాపురం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటుపై మాజీ సీఎం కేసీఆర్ 2014లో జోడేఘాట్‌లో కుమురంభీమ్ వర్ధంతి సందర్భంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాల హామీ కాగితాలకే పరిమితమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇందులో రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు హరీష్, నాయకులు గణేశ్, నగేశ్,బండు, యువరాజ్‌పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

ఎదులాపురం: ఈనెల 8, 9 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శక్కు, నగేశ్ కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు విద్యావేత్తలు,విద్యార్థులు,మేధావులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

ఒక్కొక్కరుగా..

- బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు జంప్
- అధికార కాంగ్రెస్ వైపు చూపు
- ప్రాబల్యం కోల్పోతున్న గులాబీ పార్టీ



సాక్షి,ఆదిలాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లాలోనూ ప్రాబల్యం కోల్పోతుంది. ఆ పార్టీ నుంచి ప్రజాప్రతినిధులుగా ఉన్న నేతలు అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఒకరొకరుగా పార్టీ మారుతున్నారు. ముఖ్య నేతలతో పాటు ద్వితీయ శ్రేణి నేతలు సైతం హస్తం బాటపడుతున్నారు. పార్లమెంట్, పంచాయతీ ఎన్నికలకు ముందు ఇది మరింత కొనసాగే అవకాశం ఉంది. జిల్లాలో ఈపరిణామాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

హస్తం బాట..

డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో పాటు జైనథ్ జెడ్పీటీసీ అరుంధతి, పార్టీ ఆ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డితో పాటు మరికొంత మంది నేతలు హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు కూడా ఇప్పటికే హస్తం గూటికి చేరుకున్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కూడా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదివరకు ఆదిలాబాద్ జిల్లా అంటే గులాబీ పార్టీకి అడ్డాగా ఉండేది. ఎన్నికల తర్వాత పూర్తిగా తారుమారైంది. ఒకరొకరుగా ముఖ్య నేతలు పార్టీ వీడుతున్నారు. ఎన్నికలకు ముందే బోథ్ టికెట్ దక్కకపోవడంతో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఖానాపూర్‌లో టికెట్ రాకపోవడంతో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ కూడా పార్టీని వీడి హస్తం పార్టీలో చేరారు. అలాగే ఆదిలాబాద్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి కూడా బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరారు.

ఎంత మార్పో..!

ఎన్నికలకు ముందు ఇటు ఎమ్మెల్యేలుగా అటు ముఖ్యమైన పదవుల్లో మొత్తం గులాబీ నేతలదే హవా కనిపించేది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ నెలరోజుల్లోనే జిల్లా రాజకీయాల్లో పూర్తిగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. డీసీసీబీలో ఇప్పటికి బీఆర్‌ఎస్‌కు మెజార్టీ డైరెక్టర్లు ఉన్నారు. అయితే అధ్యక్షుడు కాంగ్రెస్‌కు మారడంతో మున్ముందు వారు అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తారా.. లేనిపక్షంలో ఎలా ఉంటుందనేది చూడాల్సిందే. ఇక జెడ్పీ పాలకవర్గం గడువు మరికొద్ది నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చైర్మన్ బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పినప్పటికీ ఇప్పుడు దీంట్లో వచ్చే పెద్ద మార్పులు ఏమి ఉండకపోవచ్చని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. జిల్లాలోని రెండు నియోజకవర్గాలుండగా.. ప్రస్తుతం బోథ్ ఎమ్మెల్యే మాత్రమే బీఆర్‌ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా జోగు ప్రేమేందర్ వ్యవహరిస్తున్నారు. పలువురు బీఆర్‌ఎస్ నేతలు నామినేటెడ్ పోస్టుల్లో కొనసాగుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు జిల్లా రాజకీయ సమీకరణాలు జోరుగా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

ఆక్రమణలు తొలగింపు



షెడ్ల ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల వద్ద గల షెడ్ల ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది తొలగించేశారు. వీధి వ్యాపారుల సౌకర్యార్థం మున్సిపల్ ఆధ్వర్యంలో డైట్ కళాశాల ప్రహరీని ఆనుకుని 57 షెడ్లు నిర్మిస్తున్నారు. అయితే పనులు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. గమనించిన కొంత మంది వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండా వెదురు తడకలు, గ్రీన్‌మ్యాట్‌తో షెడ్లను ఆక్రమించుకున్నారు. ఈ క్రమంలో 'నిర్మాణాలు పూర్తి కాకుండానే ఆక్రమణలు' శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ శైలజ ఆదేశాల మేరకు వేకువజామునే ట్రాక్టర్లు, పొక్లెయిన్లతో డైట్ కళాశాల వద్దకు చేరుకున్న బల్దియా సిబ్బంది ఆక్రమణలు పూర్తిగా తొలగించారు. అక్కడి సామగ్రిని ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డుకు తరలించారు. శాంతిభద్రతల పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి అర్హులకు కేటాయించాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.



'నిర్మాణాల తొలగింపు సరికాదు'

ఎదులాపురం: ముందస్తు నోటీసులు లేకుండా తాము చేపట్టిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించడం సరికాదని పలువురు వీధి వ్యాపారులు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ గ్రౌండ్ పక్కన తాము అనేక ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా తాము ఏర్పాటు చేసుకుంటున్న నిర్మాణాలు తొలగించి, మెటీరియల్ స్వాధీనం చేసుకున్నారని వాపోయారు. వ్యాపారానికి వీలైన స్థలాన్ని కేటాయించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో వీధి వ్యాపారులు కృష్ణశర్మ, రవి, దస్తగిర్, షేక్ ఆరీఫ్, తదితరులున్నారు.

రెండు లక్షలు దాటినయ్..



నేరడిగొండ మండలం తేజాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- జిల్లాలో 'అభయహస్తం' దరఖాస్తులు 2,02,880
- నేటితో ముగియనున్న స్వీకరణ గడువు
- ఇక ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనున్న 'అభయహస్తం' ఆరు గ్యారంటీల దరఖాస్తుల సంఖ్య జిల్లాలో 2,02,880కు చేరాయి. ప్రజాపాలనలో భాగంగా గత నెల 28 నుంచి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని వార్డు సభల్లో అధికారులు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నేటితో స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. శనివారం గ్రామ పంచాయతీల్లో 28,627 దరఖాస్తులు రాగా, ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 2,712 అందాయి. ఏడో రోజు వరకు గ్రామ పంచాయతీల్లో 1,57,674, మున్సిపల్ పరిధిలో 45,206 దరఖాస్తులు అందగా మొత్తంగా ఈ సంఖ్య 2,02,880కి చేరింది. అలాగే ఇతర పథకాల కోసం గ్రామ పంచాయతీల్లో 23,572, మున్సిపల్‌లో 23,921 దరఖాస్తులు అందాయి.

నేటి నుంచి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ..

గ్రామ, వార్డు సభల్లో అందిన ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు జిల్లాలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ధరణి, ఈజీఎస్, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న 200 మంది ఆపరేటర్లను గుర్తించి శుక్రవారం వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇంకా ఎక్కడైనా అవసరమైతే మండలానికి పది మంది చొప్పున, మున్సిపల్‌లో వంద మంది ఆపరేటర్లను నియమించుకునేలా కలెక్టర్ సంబంధితాధికారులకు వెసులుబాటు కల్పించారు. కంప్యూటర్లు అందుబాటులో ఉన్న విధంగా తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ పంచాయతీల్లో ఈ ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ నెల 17వ తేదీలోపు పూర్తిచేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లొద్దు

- దరఖాస్తులు గల్లంతైతే ఆపరేటర్, ఎంపీడీవోపై కఠిన చర్యలు
- కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు దరఖాస్తుల వివరాల నమోదుపై శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తుల నమోదును పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా ఈనెల 17 వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులు గల్లంతు కాకుండా జాగ్రత్త వహించి భద్రపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే ఆపరేటర్‌తో పాటు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు మాస్టర్ ట్రైనర్ వినోద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఆపరేటర్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా.. మడిగెలు

- అనుమతుల్లేకుండా నిర్మాణాలు
- నోటీసులకే పరిమితమైన బల్దియా
- తదుపరి చర్యలకు వెనుకంజ




OFFICE OF THE MUNICIPAL COUNCIL :: ADILABAD
NOTICE

మున్సిపల్ అధికారులు జారీ చేసిన నోటీసు

అక్రమంగా చేపట్టిన మడిగెల నిర్మాణాలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు దానిపై గద్దల్లా వాలిపోతున్నారు అక్రమార్కులు. అది ప్రభుత్వ స్థలమా.. ప్రైవేట్ స్థలమా అనేది పట్టించుకోకుండా స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఆ స్థలాల్లో దర్జాగా నిర్మాణాలూ చేపడుతున్నారు. అధికారులు రంగంలోకి దిగితే తమ అక్రమాన్ని సక్రమం చేసుకునే దిశగా వారిపై రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడుతున్నారు. ఇందుకు ఆదిలాబాద్ పట్టణంలోని వార్డునంబర్ 12 న్యూహౌసింగ్ బోర్డులోని కేసీబీ గార్డెన్ సమీపంలో గల అక్రమ మడిగెల నిర్మాణాలే నిదర్శనం.

అక్రమంగా నిర్మాణాలు ఇలా..

కేసీబీ గార్డెన్‌కు వెళ్లే దారిలో పాత జాతీయ రహదారికి ఆనుకుని సర్వేనంబర్ 161/ఏలో ఓ వ్యక్తి అక్రమంగా వ్యాపార మడిగెలు నిర్మిస్తున్నాడు. ఈ ప్రాంతం వాణిజ్యపరంగా డిమాండ్ ఉండంతో అక్రమాలకు తెరలేపాడు. మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే దర్జాగా పనులు ప్రారంభించాడు. మున్సిపల్ స్థలంతో పాటు రోడ్డు స్థలాన్ని ఆక్రమించడం గమనార్హం. రహదారికి పక్కన ఏపుగా పెరిగిన ఏళ్లనాటి చెట్లను సైతం తొలగించాడు. ప్రస్తుతం నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. ఇంత జరుగుతున్నా బల్దియా యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నోటీసులతోనే సరి...

అక్రమంగా చేపట్టిన మడిగెల నిర్మాణాలపై ఫిర్యాదులు అందడంతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఆ స్థలాన్ని సందర్శించారు. వారి నివేదిక ఆధారంగా పనులు నిలిపివేయాలని పేర్కొంటూ గతేడాది డిసెంబర్ 11న సంబంధిత నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తికి మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా నిర్మాణాలు కూల్చివేయాలని, లేకుంటే తాము కూల్చివేస్తామని అందులో పేర్కొన్నారు. కాగా, నోటీసులు జారీ చేసి దాదాపు 25 రోజులు గడుస్తున్నా అక్రమ నిర్మాణాలపై అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలు తావిస్తోంది. ఈ వ్యవహారంలో ఓ వార్డు స్థాయి ప్రజాప్రతినిధి ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలున్నాయి. బల్దియా అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి వాటిని కూల్చివేయకుండా అడ్డుపడుతున్నట్లు సమాచారం.

టాస్క్‌ఫోర్స్ దృష్టికి తీసుకెళ్లాం..

కేసీబీ గార్డెన్ సమీపంలో అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపట్టిన వ్యక్తికి నోటీసులు జారీ చేశాం. ఆ స్థలం ప్రభుత్వానిదా, పట్టా ల్యాండా అనే దానిపై స్పష్టత లేకపోవడంతో విషయాన్ని జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ దృష్టికి తీసుకెళ్లాం. కమిటీ ఆదేశాల మేరకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– శైలజ, మున్సిపల్ కమిషనర్

20 ఏళ్ల పాటు జిల్లాలోనే విధులు

- బదిలీ అయిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- ఘనంగా వీడ్కోలు పలికిన జిల్లా పోలీసులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి



వాహనాన్ని తాళ్లతో లాగుతూ బదిలీ అయిన ఎస్పీకి వీడ్కోలు పలుకుతున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: తాను జిల్లాలో 20 ఏళ్ల పాటు విధులు నిర్వహించానని బదిలీ అయిన ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన ట్రాన్స్‌కోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పోలీసు అధికారులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో వీడ్కోలు పరేడ్ నిర్వహించారు. గౌరవ వందనం అనంతరం ఆయనను గజమాలతో సత్కరించారు. మైదానం నుంచి గేటు వరకు వాహనాన్ని తాళ్లతో లాగుతూ వీడ్కోలు పలికారు. పూలు జల్లుతూ ఆత్మీయంగా సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఎస్సైగా తొలిపోస్టింగ్ ఈ జిల్లాలోనే వచ్చిందన్నారు. అయితే తొలుత ఇక్కడ పోస్టు రావద్దని కోరుకున్నానని, విధుల్లో చేరిన తర్వాత మాత్రం ఇక్కడికి రావడం సంతృప్తినిచ్చిందన్నారు. తన సర్వీస్ 20 ఏళ్ల పాటు ఉమ్మడి జిల్లాలోనే సాగిందన్నారు. దేశంలోనే అత్యంత సురక్షితమైన జిల్లాగా ఆదిలాబాద్ నిలవడం తనకు గర్వకారణమని చెప్పుకొచ్చారు. మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సమయ్‌జాన్‌రావు, డీఎస్పీలు ఉమేందర్, పోతారం శ్రీనివాస్, నాగేందర్, సీఐలు సత్యనారాయణ, అశోక్, రిజర్వు పోలీసు సిబ్బంది, డీసీఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, ఫింగర్ ప్రింట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే

జిల్లా ఎస్పీగా పనిచేసి బదిలీ అయిన డి.ఉదయ్‌కుమార్ రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న కలిశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

రేషన్‌కార్డుంటే 'ఉజ్వల' ఉచితం



ఉజ్వల లబ్ధిదారులతో అదనపు కలెక్టర్, డీఎస్‌వో

కైలాస్‌నగర్: రేషన్‌కార్డు ఉండి, ఇప్పటి వరకు గ్యాస్ కనెక్షన్ లేని పేదలకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఎల్‌పీజీ కనెక్షన్ ఉచితంగా అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద ఓ ప్రైవేట్ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా అర్హులైన తొమ్మిది మందికి శుక్రవారం గ్యాస్ కనెక్షన్ ప్రొసీడింగ్ అందజేశారు. డీఎస్‌వో కిరణ్‌కుమార్‌తో కలిసి కనెక్షన్ మంజూరు పత్రాలతో పాటు సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 36,098 మందికి ఉజ్వల కనెక్షన్ అందజేశామన్నారు. ఇంకా అర్హులున్నట్లతే సమీపంలోని గ్యాస్ ఏజెన్సీలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజెన్సీ మేనేజర్‌తో పాటు పౌరసరఫరాలశాఖ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

'మహా'.. భారం!

- ఆర్టీసీ ఉద్యోగులపై పెరిగిన ఒత్తిడి
- కండక్టర్లు, డ్రైవర్లపై ప్రభావం

రీజియన్ పరిధిలోని ఉద్యోగుల సంఖ్య

డిపో	ఉద్యోగులు
ఆదిలాబాద్	440
భైంసా	268
నిర్మల్	468
ఉట్నూర్	120
ఆసిఫాబాద్	321
మంచిర్యాల	516
ఆర్ఎంవో	52
మొత్తం	2185


టికెట్లు ఇష్యూ చేస్తున్న కండక్టర్ (ఫైల్)

ఆదిలాబాద్: ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్లది కీలకపాత్ర. సంస్థ పురోగతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఈ ప్రగతి రథ సారథులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా పరిష్కారం కోసం వీరికి ఎదురుచూపులు తప్పడం లేదు. తాజాగా మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో తమపై ఒత్తిడి, పని భారం పెరిగిందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం, కేఎంపీఎల్ పేరిట ఒత్తిడి..

సంస్థను లాభాల బాట పట్టించేందుకు అధికారులు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సిబ్బందిపై వీరు ఒత్తిడి తీసుకువస్తున్నారు. డ్రైవర్ల విషయానికి వస్తే కేఎంపీఎల్ సాధించాలంటూ, అలాగే కండక్టర్లపై ఆదాయం తీసుకురావాలంటూ ప్రెషర్ చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రయాణికుల సంఖ్య పండుగలు, సాధారణ రోజుల్లో భిన్నంగా ఉంటుందని, ఒకే రకమైన ఆదాయం ఏ విధంగా తీసుకువస్తామని కండక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఇక ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటే కేఎంపీఎల్ ఎలా సాధ్యమవుతుందని డ్రైవర్లు తలలు పట్టుకుంటున్నారు.

'మహాలక్ష్మి'తో తిప్పలు..

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్ర యాణ సౌకర్యం కల్పిస్తూ మహాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ప్రా రంభం నుంచి రీజియన్ వ్యాప్తంగా మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. పరిమితికి మించి బస్సులు కిక్కిరిసిపోతుండటంతో అటు పురుషులకు, మహిళల కు (జీరో)టికెట్లను ఇచ్చే క్రమంలో తడబా టుకు గురవుతున్నారు. ఈ సమయంలో పొరపాట్లు జరుగుతుండడంతో అధికారులు వారిని మందలిస్తున్నారు. అలాగే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుండడంతో నిర్దేశిత సమయానికి బస్సులు గమ్యస్థానాలకు చేరుకోవడం లేదు. కేఎంపీఎల్ సైతం సాధించలేని పరిస్థితి ఎదురవుతున్నాయి. దీంతో డ్రైవర్లపై అధికారులు రుసరసలాడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో సరిహద్దు వరకు మహిళలకు జీరో టికెట్ ఇచ్చి ఆ తర్వాత మరో టికెట్ ఇవ్వాల్సి వస్తుంది. దీంతో ఇబ్బందులవుతున్నాయని కండక్టర్లు పేర్కొంటున్నారు. ఒక్కోసారి పలువురు ప్రయాణికులు వా గ్వాదానికి దిగుతున్నారు. దాడులకు సైతం వెనుకాడడం లేదు. ఇటీవలే ఆదిలా బాద్ డిపోకు చెందిన ఓ కండక్టర్‌పై ప్ర యాణికుడు దాడి చేయడం గమనార్హం.

ఒత్తిడితో ప్రమాదాలు...

ఉద్యోగులపై ఒత్తిడి కారణంగా ఆర్టీసీలో ప్రమాదాల సంఖ్య సైతం పెరుగుతుంది. గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో పలువురు ప్రాణాలు సైతం కోల్పోయారు. మరోవైపు పలువురు దీర్ఘకాలిక వ్యాధులకూ గురవుతున్నారు. విధి నిర్వహణలో హార్ట్ ఎటాక్ వంటివి వచ్చి బస్సులకు ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు సైతం ఉన్నాయి.

సేఫ్టీ లేకుండా పోయింది



విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నాం. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం ప్రారంభం తర్వాత అనేక ఇబ్బందులు వస్తున్నాయి. సీట్లు దొరక్కపోతే ప్రయాణికులు వాగ్వాదానికి దిగుతున్నారు. కండక్టర్లు, డ్రైవర్లకు సేఫ్టీ లేకుండా పోయింది. బస్సుల సంఖ్యను పెంచితే బాగుంటుంది. – సర్వే భీమ్ రావు, కండక్టర్

మానసికోల్లాసం కోసం వనభోజనాలు


మాట్లాడుతున్న డీఎం ప్రతిమారెడ్డి


భోజనాలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల మానసికోల్లాసం కోసం వనభోజనాల కార్యక్రమం చేపట్టినట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. నిర్మల్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంతో మహాలక్ష్మి పథకం ద్వారా అలసిపోయిన ఆర్టీసీ ఉద్యోగులకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగులకు కొద్దిపాటి ఉపశమనం కలిగించాలని వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్మల్ డిపోకు మూడు రాజధాని, ఒక సూపర్ లగ్జరీ బస్సులను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు ఆర్టీసీని ఆదరిస్తున్నారన్నారు. డిపోకు మరికొన్ని పల్లె వెలుగు బస్సులు అవసరం ఉందని నివేదిక పంపినట్లు తెలిపారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ప్రణీత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాజకీయంగా అవకాశాలు కల్పించాలి

- ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతల డిమాండ్


మాట్లాడుతున్న అడహక్ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యతను కల్పించి రాజకీయంగా గుర్తింపునివ్వాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీ సభ్యులు పూసం ఆనంద్‌రావ్, అనుసూయలు డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ పర్ధాన్ సమాజానికి చెందిన అభ్యర్థులకు ఎంపీ టిక్కెట్లు కేటాయించాలని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు ఆయా పార్టీలు రాజకీయంగా గుర్తింపునివ్వాలనే ఉద్దేశంతో పర్ధాన్ సమాజ్‌ను ఐక్యత చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. ఐక్యతను చాటుకుంటేనే అన్ని రంగాల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. సమాజ్ అభివృద్ధికి చేస్తున్న కృషిలో పర్ధాన్ సమాజ్‌లోని మేధావులు, ఉద్యోగులు, యువకులు, మహిళలు, నిరుద్యోగులు భాగస్వాములై సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కార్యవర్గం కాల పరిమితి ముగిసినందునా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ముందుగా పర్ధాన్ సమాజ్ మండల కమిటీలను నియమించనున్నట్లు వివరించారు. అందులో భాగంగానే ఆదివారం ఉదయం 11 గంటలకు బేల, మధ్యాహ్నం 2గంటలకు జైనథ్ మండలాల కమిటీలను నియమించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ డివిజన్ పరిధిల్లోని మండల కమిటీల నియమాకం అనంతరం ఆదిలాబాద్, బోథ్ డివిజన్‌ల కమిటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. విడతల వారీగా నియమిస్తున్న మండల, డివిజన్ కమిటీల నియమాకాలకు వారికి కేటాయించిన తేదీలలో పర్ధాన్ సమాజ్ కులస్తులు అందుబాటులో ఉండి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీ సభ్యులు గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, మడావి దిగంబర్, అఖిల భారతీయ పర్ధాన్ సమాజ్ ఉద్ధన్ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ ఉన్నారు.

గురుకృప దినోత్సవానికి ఏర్పాట్లు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్

నార్నూర్: ఈ నెల 11న మండలంలోని కొత్తపల్లి–హెచ్ జాతీయ బంజారా దీక్షా భూమి వద్ద నిర్వహించే గురుకృప దినోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం మండలంలోని దీక్షాభూమి వద్ద దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహారాజ్ సమక్షంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నిర్వహణపై కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్‌తో చర్చించారు. లక్ష మందితో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ నెల 11న గురుకృప దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బంజారాలకు మహారాష్ట్రలోని పొరదేవి తర్వాత తెలంగాణలోని కొత్తపల్లి –హెచ్ జాతీయ బంజారా దీక్ష భూమి రెండోవ స్థానంలో ఉంటుందన్నారు. దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో మహాపూజ ఉంటుందని తెలిపారు. జాతర ఉత్సవాలకు ఈ నెల 20వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ డీఎంను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ నారాయన్, రాథోడ్ రమేశ్, రాథోడ్ రామేశ్వర్, ఆదివాసీ నాయకుడు మెస్రం హన్మంతరావు, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావు దుర్గే, సర్పంచ్ రాథోడ్ విష్ణు, ఎంపీటీసీ పరమేశ్వర్, ఎస్ఎంసీ చైర్మన్ రాథోడ్ సుభాస్, పీర్టీయూ జిల్లా నాయకుడు రాథోడ్ సుధాకర్ పాల్గొన్నారు.





కలెక్టరేట్‌లో 'ప్లాస్టిక్ బాటిల్స్' రీయూజ్

కలెక్టర్ కార్యాలయంలో అధికారిక సమావేశాలు ఎన్నో నిర్వహిస్తుంటారు. ఈ సమావేశాలకు పలువురు ఉన్నతాధికారులు హాజరవుతుంటారు. అయితే సమావేశ మందిరంలో అధికారుల కోసం తీసుకువచ్చిన వాటర్‌బాటిల్స్ పడేయకుండా తాగిపడేసిన వాటర్ బాటిల్స్‌ను రీసైకిల్ చేస్తున్నారు. ఆ బాటిళ్లలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లో మళ్లీ నీటిని నింపుతూ అధికారులకు అందిస్తున్నారు. దీనిని చూసిన పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. ఖానాపూర్ మండలం విద్యానగర్‌కి చెందిన ముగ్బుల్‌ఖాన్ (68) గురువారం సాయంత్రం ఖానాపూర్ నుంచి నిర్మల్ పట్టణానికి స్కూటీపై పని నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని నర్సాపూర్ ఫారెస్ట్ చెక్‌పోస్టు దగ్గర ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్బుల్‌ఖాన్ తీవ్రంగా గాయపడగా స్థానికులు అతడిని అంబులెన్సులో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రమాదానికి కారణమైన మామడకు చెందిన అంబటి సాయిరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు దుర్మరణం


సంతోష్ (ఫైల్)

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రం శివారులో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సెక్యూరిటీ గార్డు దుర్మరణం చెందినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం... నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన బిట్లింగు సంతోష్(42) కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని యాక్సిస్ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని జిల్లా కేంద్రంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మండలంలోని తలవేద గ్రామ శివారులో నేషనల్ హైవే 61పై ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ షాక్‌తో మహిళ రైతు మృతి


కేవల్‌బాయి మృతదేహం

తానూరు: మండల కేంద్రానికి చెందిన కేవల్‌బాయి (35) మహిళ రైతు గురువారం సాయంత్రం వ్యవసాయ పొలంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కేవల్‌బాయి గురువారం తన సొంత వ్యవసాయ పొలంలో పనులు చేసేందుకు వెళ్లింది. సాయంత్రం బోరు మోటారు ఆఫ్‌చేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. కేవల్‌బాయి తోట నుంచి రాకపోవడంతో భర్త గౌతం అక్కడికి వెళ్లి చూడగా మృతి చెందినట్లు కనిపించింది. విషయం తెలుసుకున్న ఎస్సై సందీప్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు భర్త గౌతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

ముగిసిన సినిమా షూటింగ్


షూటింగ్ సమయంలో..

నేరడిగొండ: కుంటాల జలపాతం వద్ద స్వాగ్ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై హీరోలు విష్ణు, కిరిటీలతో పాటు హీరోయిన్‌గా రీతువర్మ నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం కుంటాల జలపాతం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ సన్నివేశాలు పూర్తయ్యాయి. దీంతో షూటింగ్‌ను ఈ ప్రాంతంలో ముగించడం జరిగిందని డైరెక్టర్ అషిత్ గోలి తెలిపారు. కాగా అటవీ శాఖ అధికారులు షూటింగ్ పూర్తయ్యేంత వరకు వారికి సహకారం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు షూటింగ్ సన్నివేశాలను ఆసక్తిగా తిలకించారు. షూటింగ్‌కు సహకరించిన వారికి డైరెక్టర్, హీరోలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


మనీషా

మంచిర్యాలఅర్బన్: ఢిల్లీలో ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీలకు స్థానిక కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న మనీషా డ్రామా సోలో విభాగంలో జాతీయస్థాయికి ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు స్పెషలాఫీసర్ స్వప్న తెలిపారు.

ఆలిండియా పోటీలకు సుజిత్..

రాజస్థాన్ జేజేటీయూ ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని సుజిత్ పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే ఆల్ ఇండియా యూనివర్సిటీ తైక్వాండో చాంపియన్ షిప్‌నకు ఎంపికై నట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది.

జెడ్పీటీసీ సభ్యురాలి ఇంటికి నిప్పు

బెజ్జూర్: గుర్తు తెలియని దుండుగులు బెజ్జూర్ జెడ్పీటీసీ సభ్యురాలు పంద్రం పుష్పలత ఇంటికి గురువారం రాత్రి నిప్పంటించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమినిలోని ఇంటిలో జెడ్పీటీసీ సభ్యురాలు పత్తి నిల్వ చేశారు. ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటికి నిప్పంటించారు. మంటలు చెలరేగగా స్థానికులు గమనించి ఆర్పివేశారు. అప్పటికే రూ.20వేల నష్టం జరిగినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు తెలిపారు. తన ఇంటికి నిప్పంటించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విక్రమ్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులకు అప్పగింత

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి మహాలక్ష్మీవాడకు చెందిన మతిస్థిమితం లేని ప్రసన్న అనే వ్యక్తిని ఆస్పత్రికి తరలించినట్లు స్థానిక సీఐ కృష్ణ తెలిపారు. అతడు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసన్న ఊత్కూరు గ్రామంలో కొందరిని ఇబ్బందులకు గురిచేయడంతో స్థానికులు చితకబాది పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కాగా, సదరు వ్యక్తిని వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


రంగయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంపీ

ఆదిలాబాద్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కడార్ల రంగయ్య– వీణ దంపతులను ఎంపీ సోయం బాపూరావు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం మారుమూల గ్రామమైన సావర్ఖేడ్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కడార్ల రంగయ్య జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై ఎంపి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగయ్య అత్యుత్తమ బోధనతో జాతీయస్థాయిలో గుర్తింపు సాధించారని కొనియాడారు. సావర్ఖేడ్ గ్రామ అభివృద్ధికి పీఎం శ్రీ పథకం కింద ఇటీవలే రూ.2కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు, గ్రామాభివృద్ధికి తనవంతుగా చేయూతను అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

అత్తింటి ఎదుట కోడలు బైఠాయింపు


కూతురుతో అత్తింటి ఎదుట బైఠాయించిన నేహ

ఆదిలాబాద్‌టౌన్: న్యాయం చేయాలని కోరుతూ అత్తింటి ఎదుట కోడలు బైఠాయించిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం... ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన నేహకు 2019లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ యువకుడితో వివాహమైంది. ఉద్యోగ రీత్యా ఆమె భర్త నాగ్‌పూర్‌లోని ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడని, భర్తే తరచుగా వేధింపులకు గురిచేసినా భరించినట్లు వాపోయింది. గర్భవతి కావడంతో పుట్టింటికి పంపించాడని, దీంతో బిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపింది. గతేడాది నుంచి భర్త కాపురానికి తీసుకువెళ్లడం లేదని, అత్తమామలు సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పలుమార్లు పోలీసులు సైతం కౌన్సెలింగ్ ఇచ్చినా అతడి తీరులో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే పట్టణంలోని పాత హౌజింగ్‌బోర్డులో భర్త, అత్తమామలు అద్దెకు ఉంటున్న నివాసానికి శుక్రవారం వెళ్లగా ఇంట్లోకి రానివ్వకుండా కొట్టారని, సెల్‌ఫోన్ పగలగొట్టారని పేర్కొంది. అనంతరం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారని, అయినప్పటికీ తాను ఇక్కడే కూర్చున్నట్లు తెలిపింది. తనకు న్యాయం కావాలని కూతురుతో అక్కడే బైఠాయించింది.

ముగ్గురి మృతి కారకుడికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: మద్యం మత్తులో అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తుల మరణానికి కారకుడైన కాగజ్‌నగర్‌కు చెందిన పుల్ల కృష్ణకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం తీర్పు చెప్పారు. లైజనింగ్ అధికారి కే సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ లైజనింగ్ అధికారి బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 2, 2020న సాయంత్రం ఈజ్‌గాం సమీపంలో పట్టణానికి చెందిన పుల్ల కృష్ణ మద్యం మత్తులో పత్తి లోడ్‌తో ఉన్న బొలెరో వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు మృతి చెందారు. ఆటో డ్రైవర్ మనోజ్ ఫిర్యాదు మేరకు కాగజ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కాగా న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్ రావు వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు అర్హులన్నారు. ఈ నెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ www.tsbcstudycircle.cgg.gov.inలో లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభించడం జరుగుతుందని, శిక్షణ నాలుగు నెలల పాటు అందించనున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వార్షికాదాయం రూ.5లక్షలలోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీ మార్కుల ఆధారంగా ఉంటుందని వివరించారు. ఎంపికైన వారికి స్టడీ మెటిరియల్ అందించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 08732–221280పై సంప్రదించాలన్నారు.

నూతన నియామకం


రాథోడ్ సంజీవ్‌నాయక్

ఇంద్రవెల్లి: బంజారా యువసేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని మచ్చపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ సంజీవ్‌నాయక్‌ను ఎన్నుకున్నట్లు శుక్రవారం మండల కేంద్రంలోని విలేకరులకు తెలిపారు. బంజారా యువసేన రాష్ట్ర అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కార్యవర్గం ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్ సంజీవ్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమాజం కోసం నిరంతరం పని చేస్తున్న తన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై కేసు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారిపై పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్‌సింగ్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

8న అప్రెంటీస్ మేళా

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఐటీఐ కళాశాలలో ఈ నెల 8న ఉదయం 10గంటలకు అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించడం జరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కోసం వివిధ పరిశ్రమల్లో ఎంఎస్‌డీఈ, సీఈటీలో జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత విద్య, అర్హత ధ్రువీకరణ పత్రాలతో అప్రెంటిస్‌షిప్ వెబ్‌సైట్ http;//apprenticeshipindia.ogr/లో రిజిస్ట్రేషన్ చేసుకొని మేళాకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9490202037 సంప్రదించాలని కోరారు.